క్లుప్తంగా

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో మనుబోలమ్మ

మనుబోలు : మనుబోలు పెద్ద చెరువు గట్టున వెలసిన గ్రామ దేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు సాయిశర్మ అమ్మవార్లకు అభిషేకాలు జరిపి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు గ్రామ దేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ముందు జాగ్రత్తగా మందుల పిచికారీ



మల్లూరులో వరిపైరుపై మందు పిచికారీ

ముత్తుకూరు : వరిపైరు కోతలకు వచ్చే ముందు రైతులు ముందు జాగ్రత్తగా మందులు పిచికారీ చేస్తున్నారని మండల వైద్యాధికారి జ్యోత్స్నరాణి తెలిపారు. రబీ సీజన్‌లో మండలంలో 8,800 ఎకరాల్లో వరిసాగు జరుగుతోందన్నారు. ఇందులో 4,500 ఎకరాల్లో బీపీటీ రకం వరిసాగు అవుతోందన్నారు. అయితే, ప్రస్తుతం వెన్ను దశలో ఆరోగ్యకరమైన పైరుకు అగ్గితెగులు, దోమపోటు సోకకుండా రైతులు మందులు చల్లుతున్నారన్నారు. పండించిన ధాన్యానికి మంచి ధర రావడం కోసం ఈ చర్యలు తీసుకుంటారని తెలిపారు. మార్చి చివరి నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు వరి కోతలు ఉంటాయన్నారు.

ప్రతిష్టాత్మకంగా మహా కుంభాభిషేకం



మాట్లాడుతున్న మల్లికార్జునరావు

కొడవలూరు(కోవూరు): కోవూరు పట్టణంలో వెలసిన శ్రీరామలింగ చాముండేశ్వరీదేవి దేవస్థానంలో అమ్మవారికి మహా కుంభాభిషేకాన్ని వచ్చే మే 25న అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు దేవాంగ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి బోనగిరి మల్లికార్జునరావు తెలిపారు. పట్టణంలోని బుద్ది పద్మావతి కల్యాణ మండపంలో సంఘ అధ్యక్షుడు పిచ్చుక మధుసూదన్‌రావు అధ్యక్షతన సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి మహా కుంభాభిషేక ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి మహా కుంభాభిషేకం అత్యంత వేడుకగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది మరింత వైభవోపేతంగా నిర్వహించ తలపెట్టినందున దేవాంగులంతా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ సభ్యులు బుద్ది భీమేశ్వరరావు, సజ్జా వెంకట సురేష్, దోనిపర్తి జయరామయ్య, జి.వెంకట నాగేశ్వరరావు, జక్కల మహేష్, పన్నెం శ్రీనివాసులు, పి.రవి, జె.మధుసూదన్‌రావు, పి.సుదర్శన్‌బాబు, పి.సుధాకర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



దుత్తలూరు: ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని నందిపాడు సమీపంలో 565వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఉదయగిరి మండలం జి.చెర్లోపల్లి వడ్డిపాళెం చెందిన బత్తుల రామయ్య, తన భార్యతో కలిసి బైక్‌పై నందిపాడు వెళ్లాడు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో చదువుతున్న తన కుమార్తెను చూసి తిరిగి స్వగ్రామం వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో రామయ్యకు తల, ఎడమ కాలికి తీవ్రగాయాలు కావడంతో ఆయన్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సత్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వలంటీర్ల సేవలను ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. నియోజకవర్గంలోని 26 నుంచి 31వ డివిజన్ల పరిధిలో గల సచివాలయాల వలంటీర్లకు సంబంధించిన వలంటీర్ల వందనం కార్యక్రమాన్ని నగరంలోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. సేవ వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎంతో గొప్ప ఆలోచనతో సచివాలయ వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని చెప్పారు. వలంటీర్ల సేవలను గుర్తించిన ప్రభుత్వం భవిష్యత్తులో వారికి మరింత మేలు చేకూర్చేలా కార్యాచరణను రూపొందించనుందని తెలిపారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హరిబాబుయాదవ్, మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గౌరి, ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానాన్ని కల్పిస్తామని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 17, 23, 24, 30, 35వ డివిజన్లకు చెందిన యువత పెద్ద ఎత్తున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. నగరంలోని తన నివాసంలో వీరికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. రమేష్, సాయిరెడ్డి, ముకేష్ బాబు, ఇంద్రసేనారెడ్డి, మంజున్, ముకేష్, సాగర్, వేణు, నాగేంద్ర, సతీష్, ప్రసాద్ తదితరులు పార్టీలో చేరారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నేతలు కమల్, జగదీష్, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల

నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లక్కాకుల పెంచలయ్య, దేవప్రసన్నకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఎన్నికల ప్రక్రియను పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా ఇమ్మానుయెల్, కోశాధికారిగా షాకీర్ అహ్మద్, జేసీసీ మెంబర్‌గా పవన్‌కుమార్, స్టేట్ కౌన్సిలర్లుగా రమేష్‌బాబు, రమేష్, నాగరాజు, ఆనంద బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సురేష్‌కుమార్, తనోజ్‌కుమార్, భవ్య, జ్యోతి, విజిత, రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కృష్ణకుమార్, మార్కండేయులు వ్యవహరించారు.

బర్డ్ ఫ్లూ నివారణకు ముమ్మర చర్యలు



గండవరంలో బ్లీచింగ్ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

కొడవలూరు : మండలంలోని గండవరంలో పంచాయతీ అధికారులు ఆదివారం బర్డ్‌ఫ్లూ నివారణ చర్యలు చేపట్టారు. ఈ గ్రామంలో ఆదివారం ఐదు చికెన్ దుకాణాలు నిర్వహిస్తుంటారు. అధికారులు ముందస్తుగా దుకాణ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేసి దుకాణాలు తెరవకుండా చర్యలు తీసుకోవడంతో పాటు చికెన్ దుకాణాల వద్ద, గ్రామంలోని వీధుల్లో చెత్తా చెదారాలు తొలగించి బ్లీచింగ్ చేయించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎం.బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చికెన్ దుకాణాలు మూయించామని, తదుపరి ఆదేశాల వరకు దుకాణాలు తెరిచేందుకు అనుమతించమని స్పష్టం చేశారు.

వేడుకగా సూర్య నమస్కారాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన సూర్యభగవానుడికి అభిషేకాలు, పూజలను ఆదివారం నిర్వహించారు. సూర్య నమస్కారాలు, నృత్య ప్రదర్శనను గురుకృప కళాక్షేత్రం, సురభి గాయత్రి భక్తమండలి ఆధ్వర్యంలో జరిపారు.

చిన్నారి ఆపరేషన్‌కు రూ.50 వేల సాయం



చిన్నారి తల్లి పద్మకు ఆర్థిక సాయం చేస్తున్న సంఘ నేతలు

కొడవలూరు(కోవూరు): కోవూరు మండలంలోని గుమ్మళ్లదిబ్బకు చెందిన నిరుపేద కుటుంబం మోతుకూరి వెంకటసాయి, పద్మ దంపతుల ఐదు నెలల చిన్నారి గుండె శస్త్రచికిత్స నిమిత్తం ఏపీ వీవర్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు రూ.50 వేల సాయం అందించారు. ఈ మేరకు నగదును సంఘ నేతలు కేవీ శేషయ్య, బీ మల్లికార్జునరావు, ఎస్.వెంకటసురేష్ చేతుల మీదుగా కోవూరులో ఆదివారం చిన్నారి తల్లి పద్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ ఎత్తివేయడంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో చేనేత సామాజిక భవనాలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎన్.శ్రీనివాసులు, పి.మాలకొండయ్య, ఎం.నరేంద్ర, కె.రాజా తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ ఎంపిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం సమావేశ మందిరంలో ఆదివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వాసు, ప్రధాన కార్యదర్శిగా థామస్ పీటర్ (నెల్లూరు), కోశాధికారిగా చిరంజీవి (కావలి), కార్యనిర్వాహక కార్యదర్శిగా సురేష్ (బుచ్చిరెడ్డిపాళెం)తో పాటు వివిధ మండలాల కార్యదర్శులు, ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల్లో ఉద్యోగ విరమణ పొందనున్న జలదంకి వ్యాయామ ఉపాధ్యాయుడు జీటీ స్వామిని సత్కరించారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

కంటేపల్లిలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వెంకటాచలం : మండలంలోని కంటేపల్లి గ్రామంలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని శ్రీవత్స చెస్ట్ అండ్ చిల్డ్రన్స్ క్లినిక్ వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊపిరితిత్తులు, శ్వాసకోశ వైద్య నిపుణురాలు డాక్టర్ కల్యాణి, చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ చిరంజీవి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ కె.సునీత, సోషల్ వర్క్ అధ్యాపకుడు బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాంగులకు సీట్లు కేటాయించరూ..

నెల్లూరు(మినీబైపాస్): రానున్న ఎన్నికల్లో చేనేత సామాజికవర్గానికి చెందిన దేవాంగులకు సీట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడు సజ్జా సతీష్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తమకు ప్రాధాన్యమిచ్చే పార్టీలకే మద్దతిస్తామని పేర్కొన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌరాబత్తిన శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

పింఛనర్ల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని సంక్షేమ భవనంలో మంగళవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్పీవీఎస్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్పొరేషన్లో 'స్పందన' నేడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో అర్జీలను అందజేయాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కుంభాభిషేకం

నెల్లూరు రూరల్: పుష్కర కుంభాభిషేక మహోత్సవాలను పురస్కరించుకొని కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలను ఆదివారం నిర్వహించారు. ఆలయ ఆవరణలో నిర్మించిన 36 అడుగుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శిల్పానికి మహాకుంభాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మయూర వాహనంపై స్వామివారు రాత్రి విహరించారు. ఉభయకర్తలుగా పిడూరు శ్రీనివాసులురెడ్డి, కవితమ్మ దంపతులు వ్యవహరించారు. విగ్రహ దాత పొన్నవోలు అమలమ్మ, షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మండప నిర్మాణ దాతలు దువ్వూరు వెంకటేష్‌రెడ్డి, పద్మావతి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.



మార్గదర్శకాలను తప్పక పాటించాలి



శిక్షణ తరగతులకు హాజరైన అధికారులు, సిబ్బంది

• కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఈఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియపై నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గల సమావేశ మందిరంలో సెక్టార్.. పోలీస్ అధికారులకు ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యలు సృష్టించే వ్యక్తుల వివరాలను ముందే సేకరించి చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎన్నికల కేంద్రాలను అధికారులు సందర్శించేందుకు వీలుగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని కోరారు. దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం అన్ని కేంద్రాల్లో ర్యాంప్, వీల్‌చైర్లు, ప్రత్యేక సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

హెచ్ఐవీపై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని ఏపీ శాక్స్, డాప్క్యూ ఆధ్వర్యంలో సింహపురి స్వగతి మహిళా అభ్యుదయ సంఘ కళాకారులు ఆదివారం నిర్వహించారు. జానపద నృత్యాల ద్వారా అవగాహన కల్పించారు. ఖాదర్‌వలీ, శివ తదితరులు పాల్గొన్నారు.



గాయకుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): అభినవ ఘంటసాల బిరుదాంకితుడు పాటూరు శ్రీనివాసులును గాంధీ బొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో సత్కరించారు. కళాంజలి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి హాజరయ్యారు. కళాంజలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి రైతుల కృతజ్ఞతలు

నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కొమ్మరపూడికి చెందిన పలువురు పేద రైతులు ఆదివారం కలిసి కృతజ్ఞతలను తెలియజేశారు. జగనన్న కాలనీకి సంబంధించిన భూసేకరణ పరిహార బకాయిలపై ఎంపీకి పలువురు రైతులు గతంలో వినతి పత్రాన్ని సమర్పించారు. కొందరు రైతులకు పరిహారం రాగా, మరో 62 మందికి జమకాలేదని అప్పట్లో తెలియజేశారు. ఈ తరుణంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వీరి బ్యాంక్ ఖాతాల్లో రూ.7.7 కోట్లు జమయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎంపీకి కృతజ్ఞతలను తెలియజేశారు.



23న జాతీయ సదస్సు

నెల్లూరు(మినీబైపాస్): వ్యవసాయం, ఆహారోత్పత్తులు, ఆభరణాల రంగాలు తదితరాలపై జాతీయ సదస్సును చెన్నైలో ఈ నెల 23న నిర్వహించనున్నామని ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్, చెన్నై వైస్ చైర్మన్ కృష్ణమోహన్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. చెన్నైలోని గిండీలో గల రమాదా ప్లాజా హోటల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సదస్సును నిర్వహించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు ముందుగా నమోదు చేసుకోవాలని, వివరాలకు 98480 77227 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న కృష్ణమోహన్

చేపలకు ఫుల్ గిరాకీ..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ విక్రయాలపై నిషేధాజ్ఞలు విధించారు. ఈ క్రమంలో చికెన్ ప్రియులు చేపలవైపు మొగ్గు చూపారు. దీంతో ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. దీంతో చేపల విక్రయదారులు కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయించారు. దీంతో కిలో లైవ్ చేపల ధర రూ.220 నుంచి రూ.250 వరకు పెరిగింది. అయినా కొనుగోలు చేసేందుకు మాంసాహార ప్రియులు క్యూ కట్టారు. మటన్ ధర సైతం ఒక్కసారిగా రూ.వెయ్యి నుంచి రూ.1100 వరకు పెరిగింది.

